ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

అల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని వివిధ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జై భారత్‌నగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కాలనీ వాసులు అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని కోరారు. ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు కుమారస్వామి, మహేష్, ప్రభాకర్ రావు, సాంబశివరావు, సురేష్, వెంకటేష్, శ్రీనివాసరావు, కృష్ణారావు, నర్సయ్య, రాఘవేంద్రరావు, భాస్కర్ రెడ్డి, శ్రీధర్, నాయకులు నిరంజన్ గౌడ్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరంలో పాల్గొన్న కాలనీ వాసులు, నిర్వాహకులు, వైద్యులు

మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ నగేష్ పంపాటి అన్నారు. శనివారం మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో జీఎంజే కేన్సర్ ఆసుపత్రి, మోతీనగర్ లయన్స్ క్లబ్, సనత్‌నగర్ లయన్స్ క్లబ్ హైదరాబాద్ టీం, డాక్టర్ ఎస్‌సీ ప్రసాద్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో స్త్రీలకు సంబంధించిన వివిధ పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. సాధారణ పరీక్షలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంపు చైర్మన్ నలమాల్పు అంజిరెడ్డి, చైర్మన్ కోటిరెడ్డి, ప్రతినిధులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ మధు, నాయకులు తిరుపతి రెడ్డి, నాగేశ్వరావు, శ్రీదేవి, రమణారెడ్డి, భుజంగరావు, రంజిత్‌కుమార్ రెడ్డి, సత్యకుమార్, రంగారావు, రమాదేవి రెడ్డి, సంపత్‌కుమార్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


బహుమతులు పొందిన విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, భారత్‌వికాస్ పరిషత్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం జరిగిన భారత్ కో జానో క్విజ్ కార్యక్రమంలో 35 పాఠశాలల నుంచి 70 గ్రూపులతో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ఎం హైస్కూలు విద్యార్థులు జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఆర్‌ఆర్ విద్యాభవన్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో సీహెచ్. హన్మంతరావు, రాజేశ్వరరావు, సుజన ప్రభ, బీవీపీ రాష్ట్ర అధ్యక్షులు సతీష్ గౌడ్, కూకట్‌పల్లి అధ్యక్షులు సీహెచ్. అనిల్ కుమార్, పంచశీల శ్రీనివాస్, ఎం. సుబ్రహ్మణ్యం, పి. సుకృత్‌కుమార్, సుబ్బారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి!

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని మృతురాలి బంధువుల ఆందోళన
- రూ.10 లక్షల పరిహారం ప్రకటించిన యాజమాన్యం


మాధవి

సుభాష్‌నగర్: సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలు బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ ఘటన శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. బాచుపల్లికి చెందిన మాధవి (28) ఈ నెల 4న గాల్ బ్లాడర్‌లో స్టోన్ ఆపరేషన్ కోసం ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యింది. ఈ నెల 6న సర్జరీ చేశారు. రక్త స్రావంతో కోమాలోకి వెళ్లిందని కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. దీంతో చనిపోయిన మహిళకు చికిత్స పేరుతో బతికి ఉందని చూపిస్తున్నారని అదే రోజు బంధువులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. మాధవికి ట్రీట్‌మెంట్ అందిస్తున్నామని చెప్పడంతో బంధువులు శాంతించారు. తాజాగా శనివారం చనిపోయిందని వెల్లడించడంతో బంధువుల ఆందోళనకు దిగారు. ఆసుపత్రిలోని ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో సూరారం పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారంతో పాటు ఇద్దరి పిల్లల చదువులకు అయ్యే ఖర్చులను భరిస్తామని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడంతో కుటుంబీకులు శాంతించారు. మృతురాలి స్వస్థలం మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టి పల్లి గ్రామం.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బీఆర్‌ఎస్ శ్రేణులతో సమావేశం


కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ మహేశ్వరి తదితరులు

కూకట్‌పల్లి: కార్యకర్తలకు ఎటువంటి ఆపద వచ్చినా ఆదుకుంటామని, అధైర్యపడొద్దని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బేగంపేట డివిజన్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న నాలా సమస్యను వీలైనంత వరకు పరిష్కారం చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సురేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నరేష్, రాజయ్య, రఘునాథ్, ప్రవీణ్, మాణిక్యం, సునీత, సాయి, శ్రీను, బాల్‌రాజ్, జహంగీర్, జావిద్, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలి

కేపీహెచ్‌బీకాలనీ: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రజా సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీలా అపార్టుమెంట్‌కు వెళ్లే మార్గంలోని డ్రైనేజీ నీళ్లు, వరద నీరు నిలిచిపోవటం , మలేషియన్ టౌన్‌షిప్‌లో అధిక వర్షాలు వచ్చినప్పుడు వర్షం నీరు, డ్రైనేజీ నీరు నిల్వడం వల్ల దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి శ్రీలా అపార్టుమెంట్ మార్గాన్ని, మలేసియన్ టౌన్‌షిప్ ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీలా అపార్టుమెంట్‌కు వెళ్లే మార్గాన్ని వర్షపు నీరు, డ్రైనేజీ నీరు వెళ్లడానికి సంబంధించిన సమస్యను స్థల యజమానులతో మాట్లాడి పరిష్కారం చేస్తామన్నారు. అదే విధంగా మలేషియన్ టౌన్‌షిప్‌లోని సమస్యను కూడా అధికారులు, కాలనీ వాసులు సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, మలేషియన్ టౌన్‌షిప్ అధ్యక్షులు సాయిచౌదరి, కాకర్ల సురేష్, ఆదినారాయణ, రాజేష్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కూకట్‌పల్లి: ఫతేనగర్ డివిజన్‌కు చెందిన ఎస్ సాయితేజకు రూ. 2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.


నీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని వేగంగా దూసుకువచ్చిన బుల్లెట్ వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ ఏడవ ఫేజ్, ఎల్‌ఐజీ గృహాల్లో నివాసం ఉండే నరసింహ మూర్తి (60) తెల్లవారుజామున టీ తాగే అలవాటు ఉంది. దీంతో శనివారం ఉదయం ఫోర్త్ ఫేజ్ వైపు వెళ్లేందుకు ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో హైటెక్ సిటీ వైపు వెళ్తున్న సురేందర్ బుల్లెట్ వాహనంతో ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు దాటుతున్న నరసింహమూర్తిని ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మూసాపేట: కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద శనివారం గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రగతినగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


కాలనీ వాసులతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

అల్విన్‌కాలనీ: ప్రగతినగర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆయన కార్యాలయంలో కాలనీ వాసులు కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, అవసరమున్న చోట యూజీడీ పైపులైన్లు వేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో ప్రగతినగర్ కాలనీలో పర్యటిస్తానని, డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కాలనీలో అవసరమున్న చోట వీధి దీపాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తిరుపతిరావు, విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, రాము, ముత్తయ్య, ప్రభాకర్‌రెడ్డి, మోహన్, సారయ్య, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పార్థి బస్తీలో కార్పొరేటర్ పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పార్థి బస్తీలో శనివారం ఏఈ రాధాకృష్ణ, స్థానికులతో కలిసి ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో యువకుల కోసం జిమ్ ఏర్పాటు చేసేందుకు కమ్యూనిటీ హాల్‌లో మరమ్మతులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కంచి భిక్షపతి, జయమ్మ, గణేష్, శోభన్‌బాబు, బబ్లు, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెయింటింగ్ పోటీలు

అల్విన్‌కాలనీ: విజయనగర్ కాలనీలోని ఆర్ట్‌బార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'బాల్యం నాడు–నేడు' అనే అంశంపై సబ్ జూనియర్స్ 5 నుంచి 7 సంవత్సరాలు, జూనియర్స్ 8 నుంచి 10 సంవత్సరాలు, సీనియర్స్ 11 నుంచి 15 సంవత్సరాల వయస్సు వారు అర్హులని తెలిపారు. డ్రాయింగ్ షీట్, ఇతర సామగ్రి పోటీలో పాల్గొనే వారే తెచ్చుకోవాలన్నారు. గెలుపొందిన వారికి నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా సాయంత్రం 4 గంటలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9985340003 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు లక్ష తమలపాకుల అర్చన

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో దాసాంజనేయ స్వామికి ఆదివారం తమలపాకుల అర్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి శనివారం తెలిపారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 నుంచి స్వామి వారికి లక్ష తమలపాకుల అర్చన ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

అల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ కాలనీకి చెందిన వినోద్ కుమార్‌కు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, తిరుపతిరావు, విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, రాము, ముత్తయ్య, ప్రభాకర్‌రెడ్డి, మోహన్, సారయ్య పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని కార్పొరేటర్ పగుడాల శిరీష అన్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరినగర్ వసుంధర హాస్పిటల్ వద్ద సీసీ రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్ రావు, సుశీల్‌కుమార్, శారద, బాబు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు అందజేత


స్కూల్ బ్యాగులను అందజేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావునగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సొంత నిధులతో స్కూల్ బ్యాగులను శనివారం అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుమారు 35 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పెన్నులు, పుస్తకాలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి బీసీ సెల్ అధ్యక్షులు నాగుల సత్యం, వెంకటరమణ, సుధాకర్, సాయి, శివ, సాంబశివ, భిక్షపతి పాల్గొన్నారు.

సీపీఎం ఇంటింటి ప్రచారం

కుత్బుల్లాపూర్: డిసెంబరు 7,8 తేదీల్లో జరిగే సీపీఎం మేడ్చల్ జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని శనివారం షాపూర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ మహాసభల్లో రాష్ట్ర నాయకులతో కలిసి పెద్ద సంఖ్యలో జిల్లా, మండల నాయకులు పాల్గొననున్నారని తెలిపారు. ఽ ప్రజా సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

ఇంటింటికీ తిరిగి.. వివరాలు నమోదు చేసి

- కొనసాగుతున్న ఇంటింటి సమగ్ర సర్వే
- పరిశీలించిన సర్వే అబ్జర్వర్ మయాంక్ మిట్టల్


మూసాపేట డివిజన్ చైతన్య బస్తీలో సర్వేను పరిశీలిస్తున్న అబ్జర్వర్ మయాంక్ మిట్టల్, జెడ్సీ

మూసాపేట: మూసాపేట డివిజన్ చైతన్య బస్తీలో శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సర్వే అబ్జర్వర్ మయాంక్ మిట్టల్, ఐఏఎస్ అధికారి పరిశీలించారు. ఎన్యుమరేటర్స్‌తో పాటు సూపర్‌వైజర్‌లను సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని, పూర్తి విరాలు ఇస్తున్నారా? ఒక ఫారం నింపడానికి ఎంత సమయం పడుతుందని తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, డీసీ వంశీకృష్ణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

6 తరువాతే వివరాల నమోదు

మూసాపేటలో శనివారం కూడా స్టిక్కరింగ్ చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత సుమారు 5 ఫారాలు నింపారు. స్టిక్కరింగ్ ఇంకా పూర్తి కాకపోవడం, మూసాపేటలో కూలి పని చేసుకునే ప్రజలు అధికంగా ఉన్నారు. వారు పనులకు వెళ్లి సాయంత్రం ఐదున్నర తర్వాతే ఇళ్లకు చేరుకోవడంతో అప్పుడే ఫారం నింపడానికి సిబ్బందికి అనుకూలంగా ఉంటుంది. ఇలా పలు కారణాలతో మూసాపేట ప్రాంతంలో సాయంత్రం సర్వే వివరాల ఫాంను నింపడం ప్రారంభించారు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో ఉదయం నుంచే నింపే అవకాశం ఉంది.


స్నేహపురి కాలనీలో ఇంటికి స్టిక్కర్ అంటించిన ఎన్యుమరేటర్


అల్లాపూర్‌లో ఇంటికి స్టిక్కర్ వేసిన ఎన్యుమరేటర్

మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలో..

మోతీనగర్: మూసాపేట డివిజన్‌లో 128 మంది ఎన్యుమరేటర్లు నాలుగు రోజుల నుంచి సుమారు 13 వేల ఇళ్లకు స్టిక్కరింగ్ వేసినట్లు కుటుంబ సర్వే నిర్వహణ అధికారిని వర్షిణి తెలిపారు. అదే విధంగా అల్లాపూర్ డివిజన్‌లో 282 మంది ఎన్యుమరేటర్లు సుమారు 27 వేల ఇళ్లకు స్టిక్కరింగ్ అంటించినట్లు సర్వే ప్రత్యేక అధికారి రంజిత్ తెలిపారు.

దవాఖానాల్లో మందుల్లేవ్...!

- వ్యాధులు విజృంభిస్తున్న వేళ.. పీహెచ్‌సీల్లో మందుల కొరత
- యాంటీబయాటిక్స్ పరిమితమే
- నొప్పులు, రక్తపోటు, షుగర్‌కు సంబంధించిన మందులు కరువే
- పక్క జిల్లాల నుంచి సర్దుబాటు చేస్తున్న వైద్య సిబ్బంది



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వ్యాధులు విజృంభిస్తున్న వేళ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత రోగులను ఇబ్బందులకు గురి చేస్తోంది. సాధారణ జ్వరాలు, ఇతర వ్యాధులతో దవాఖానాలకు రోగులు బారులుదీరుతున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా అన్ని ప్రాథమిక గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు జ్వర పీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. విభిన్న వాతావరణ మార్పులతో పలువురు అనారోగ్య సమస్యలకు అవస్థలు పడుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ కేసులు కూడా నమోదు అవుతున్నాయి. పిల్లలు, వృద్ధులు, పెద్దలనే తేడా లేకుండా రోగాల బారిన పడుతున్నారు.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (మేడ్చల్, ఘట్కేసర్, శామీర్‌పేట) ఉన్నాయి. అలాగే 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ఇందులో 11 పీహెచ్‌సీల్లో డెలివరీ పాయింట్స్ ఉన్నాయి. 26 యూపీహెచ్‌సీలు ఉండగా, ఇందులో 6 డెలివరీ పాయింట్స్ ఉన్నాయి. 103 పల్లె, 71 బస్తీ దవాఖానాలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. జిల్లాలో 24 గంటలు పని చేసే 13 ఆసుపత్రుల్లో 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ప్రతీ రోజు ఓపీలో భాగంగా బయటి రోగుల సంఖ్య సాధారణంగా 80 నుంచి 125 ఉండగా, ప్రస్తుత వ్యాధుల సీజన్‌లో 200 దాటుతోంది. ఏరియా, కమ్యూనిటీ ఆసుపత్రుల్లో ఇంకా అధికంగా ఉంటోంది. వీటి పరిధిలో జ్వర బాధితులు ఎక్కువ మంది నమోదవుతున్నారు. కానీ, ఆయాచోట్ల సిబ్బంది కొరతకు తోడు మందుల కొరత నెలకొంది. కనీసం డైక్లోఫినాక్ మాత్రలు అందుబాటులో లేని దయనీయ పరిస్థితి నెలకొంది. యాంటీబయాటిక్స్ నిల్వలు కొంత వరకే ఉన్నాయి. కీళ్ల నొప్పులు, జలుబు, షుగర్, రక్తపోటుతో పాటు.. చర్మ వ్యాధులకు సంబంధించిన మాత్రలు, దురదలకు సంబంధించిన ఆయింట్‌మెంట్స్ కొరత కూడా తీవ్రంగానే ఉంది.

సర్దుబాటు చేస్తున్నాం



జిల్లాలో నిరంతరంగా జ్వరం సర్వే కొనసాగిస్తున్నాం. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలో అందుబాటులో ఉన్న మందులకు తోడు రోగులకు అవసరమయ్యే మందులను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి సర్దుబాటు చేస్తున్నాం. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్‌ఓ